క్లుప్తంగా

16న కంకలమ్మ బోనాలు

కౌటాల: మండల కేంద్రానికి సమీపంలోని గుట్టపై గల కంకలమ్మ ఆలయంలో ఈ నెల 16న బోనాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఆదివారం తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉదయం 10.30 గంటలకు ఆషాఢ బోనాలు నిర్వహిస్తామన్నారు. బోనాల సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

బ్రహ్మ గర్జనకు తరలిన బ్రాహ్మణులు



బ్రహ్మగర్జనకు తరలివెళ్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్: బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని పథకాలు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఆదివారం తలపెట్టిన బ్రహ్మగర్జనకు బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు జిల్లా కేంద్రం నుంచి తరలివెళ్లారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగరే మనోజ్‌కుమార్, నరేశ్ శర్మ, బాలకిషన్, శేష గిరి, రవీందర్, సతీశ్, రమణ, శ్రీనివాస్ ఉన్నారు.

నేడు రజక సంఘం సమావేశం

తిర్యాణి: రజక సంఘం మండల కమిటీ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని కుమురం భీం భవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు నల్లూరి జగదీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో సంఘం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న రిజ్వాన్

కెరమెరి: మండలంలోని చింతకర్రకు వెళ్లే రోడ్డుకు బీఆర్‌ఎస్ నాయకుడు, ధనోరా ఉప సర్పంచ్ రిజ్వాన్ సొంత ఖర్చుతో ఆదివారం మరమ్మతులు చేయించారు. రోడ్డుపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా రిజ్వాన్ రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

కరెంట్ సమస్య పరిష్కరించాలని రాస్తారోకో

జన్నారం: ఇందన్‌పల్లి గ్రామంలో లోవోల్టేజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జన్నారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదుట ఇందన్‌పల్లి గ్రామస్తులు రాస్తారోకోకు దిగారు. కరెంటు సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. లో వోల్టేజీ సమస్యను తీర్చాలని కోరారు. ఇందన్‌పల్లిలో మినీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, పర్మినెంట్ లైన్ మెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ఇరువైపుల వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై తానాజీనాయక్ అక్కడికి చేరుకుని, సబ్ ఇంజనీర్ అజయ్‌ని పిలిపించి మాట్లాడించారు. 15రోజుల్లో విద్యుత్ సమస్య తీరుస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కంటెం శంకరయ్య, చంద్రగౌడ్, మల్లేశ్, తిరుపతి, భగవంతరావు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీ రైతు బైండోవర్ సరికాదు'

ఆసిఫాబాద్: ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయ అండదండలతో మండలంలోని మాలన్‌గోందికి చెందిన ఆదివాసీ రైతును పోలీసులు బైండోవర్ చేయడం సరికాదని తుడుందెబ్బ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. సోమవారం మాలన్‌గోంది భూ వివాదాన్ని పరిశీలిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివాసీ భూమిని కబ్జా చేసి, అడ్డదారుల్లో పట్టా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోకుండా అతనికే వత్తాసు పలకడం సరికాదన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోయ వాగు గ్రామపంచాయతీలో ఆదివారం సీసీరోడ్డుకు జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు కాగా, పనులు ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, సర్పంచ్ లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



జల విద్యుత్ కేంద్రం కోసం సర్వే నిర్వహించిన ప్రదేశం

కలగానే తలాయి జల విద్యుత్!

- ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం
- జల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలం
- స్వరాష్ట్రంలోనూ ఎదురుచూపులే

బెజ్జూర్: మండలంలోని తలాయి జల విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం గాలికొదిలేసింది. స్వరాష్ట్రంలోనైనా ప్రాజెక్ట్ ముందుకు కదులుతుందని ఆశపడ్డ స్థానికులకు నిరాశే మిగిలింది. రాష్ట్రం ఏర్పడి ఏళ్ల గడుస్తున్నా దీనిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

నిజాం హయాంలోనే బీజం..

మండలంలోని తలాయి గ్రామ సమీపంలో ప్రాణహిత నదిపై జల విద్యుత్ కేంద్రానికి నిజాం ప్రభుత్వ హయాంలోనే బీజం పడింది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఈ కేంద్రం నిర్మించాల్సి ఉండటంతో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉమ్మడిగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న దేవులమర్రి, తెలంగాణలోని తలాయి గ్రామాల మధ్య జల విద్యుత్ కేంద్రం కోసం నిజాం ప్రభుత్వం సర్వే నిర్వహించింది. అప్పట్లో రెండు రాష్ట్రాలు నిజాం పరిపాలనలో ఉండేవి. ఆ తర్వాత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగి కాంగ్రెస్ పార్టీ తరఫున బూర్గుల రామకృష్ణారావు సీఎం అయ్యారు. ఆయన హయాంలో కూడా రెండు దశల్లో సర్వేలు నిర్వహించారు. 1952 నుంచి 1954 వరకు దాదాపు 18 నెలల పాటు సర్వేలు చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. 1955లో పనుల కోసం కొన్ని భారీ యంత్రాలను సైతం పని ప్రదేశానికి తీసుకురాగా, అదే సంవత్సరం అక్కడ పనిచేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు, ప్రైవేట్ గుమాస్తా భార్య ప్రమాదవశాత్తు తెల్ల ఇసుక మడుగులో పడి మృతిచెందడంతో కొంత కాలం పనులు నిలిపివేశారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత నుంచి సర్వే పనులు ముందుకు సాగలేదు. యంత్రాలను సైతం వెనక్కి తీసుకెళ్లారు.

టీడీపీ హయాంలో కేబినెట్ ఆమోదం..

1999లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం 16 మినీ జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టేందుకు నిర్ణయించింది. అప్పటి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది. ఇందులో తలాయి విద్యుత్ కేంద్రం కూడా ఉంది. అనంతరం తెలుగుదేశం పార్టీ ఓటమి చెందడంతో ప్రాజెక్టు మరుగున పడింది.

2007లో ఏపీ జెన్‌కో సర్వే..

ఉమ్మడి ప్రభుత్వ హయాంలో 2007లో ఏపీ జెన్‌కో అధికారులు తలాయి ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలాన్ని సందర్శించారు. అక్కడ జల విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసి 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టవచ్చని పేర్కొన్నారు. కానీ సంస్థ పరిధుల మేరకు 25 మెగావాట్ల ప్రాజెక్టులు మాత్రమే నిర్మించే అవకాశం ఉండడంతో వెనుదిరిగారు.

అభివృద్ధికి సహకరించాలి



జల విద్యుత్ కేంద్రం నిర్మించి మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జల విద్యుత్ కేంద్రం నిర్మించేలా కృషి చేయాలి.

– వనం రాములు, తలాయి

ఉపాధి లభిస్తుంది



జల విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తి చేస్తే మారుమూల ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఉద్యమ సమయంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇచ్చిన హామీ మేరకు జల విద్యుత్ కేంద్రం నిర్మించాలి.

– నైతం బాపు, తలాయి

హామీలు నీటిమూటలే..

తెలంగాణ ఉద్యమ సమయంలో మండలంలో బస్సుయాత్ర సందర్భంగా కేసీఆర్ తలాయి జల విద్యుత్ కేంద్రం ఆంధ్రుల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని వనరులు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని పాలకులను విమర్శించారు. 2009 ఎన్నికల సందర్భంగా అప్పట్లో నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సైతం తలాయిని సందర్శించారు. తలాయి ప్రాజెక్టు ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. తలాయి జల విద్యుత్ కేంద్రం పూర్తయితే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఎన్నికల్లో హామీ ఇచ్చినా బీఆర్‌ఎస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా తలాయి జల విద్యుత్ కేంద్రం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల టోకెన్ సమ్మె

కాగజ్‌నగర్‌రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులు ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు వంటలు బంద్ చేసి టోకెన్ సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అక్షయపాత్రకు అప్పగించే విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని, తదితర డిమాండ్లతో టోకెన్ సమ్మె చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై జగదీశ్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్ 5 (దుర్గానగర్) గ్రామానికి చెందిన అమిత్ బిరాయి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులు తిరిగి అందజేశారు. శనివారం ఈజ్‌గాం మార్కెట్‌కు వెళ్తూ బాధితుడు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, స్పందించిన ఎస్సై జగదీశ్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించి బాధితుడికి ఆదివారం అప్పగించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నయీం పాల్గొన్నారు.

నేడు బెజ్జూర్‌లో విద్యుత్ అదాలత్

కౌటాల: బెజ్జూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు కౌటాల ఏడీఈ రాజేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్ మండలాల్లో విద్యుత్ వినియోగదారుల అధిక బిల్లులు, ఇతర సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదాలత్ ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



బెజ్జూర్‌లో మాట్లాడుతున్న ఉపేందర్



కౌటాల: భోజనం చేస్తున్న కార్మికులు

బెజ్జూర్: మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 51ను వెంటనే సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి జీవో నం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి అన్ని కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్మికులు వసంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వంటావార్పు

కౌటాల: పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు ఆదివారం వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులు కరుణాకర్, రాజారం, జాడి మోరేశ్వర్, మోర్లె నాగేశ్, శంకర్, దేవాజీ, భానేశ్ పాల్గొన్నారు.



కెరమెరి: సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో కార్మికులు రాథోడ్ రాందాస్, రామిల్ల నరేశ్, తిరుసుల్ల సంతోష్, భీంరావు, వినేష్, స్వామి, మల్లేశ్, దత్తు, ప్రకాశ్, పాండు తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా సీసీ రోడ్డు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పొట్టి శ్రీరాములుచౌక్ వద్ద సీసీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా సీసీరోడ్డుపై మరో సీసీ వేయడంతో రోడ్డు తెగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఈ రహదారిపై నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్‌తో పాటు పలు ప్రాంతాల్లో రహదారులు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదివారం గురుస్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి ప్రభాకర్, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. క్రీడా స్ఫూర్తితో ఆడి ఆటల్లో రాణించాలని సూచించారు. అండర్–14విభాగంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు తొంగల మల్లేష్, గెల్లి జయరాం, సలీం, తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా భానుప్రసాద్

రెబ్బెన: మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని నంబాలకు చెందిన బక్క భాను ప్రసాద్ ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో మత్స్యశాఖ అధికారులు మత్స్య సహకార సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా బక్క భానుప్రసాద్, డైరెక్టర్లుగా ఎద్దు ప్రకాశ్ (డబ్బా), అంకం పాపయ్య (రెబ్బెన), సూర్ల ఇస్తారి (బెజ్జూర్), బామినే పోచయ్య (సిర్పూర్.టి), తోకల భీమయ్య (రుద్రపూర్), నిర్మల్ కృష్ణ (ఈస్గాం), బామినే శ్రీనివాస్ (తుంగెడ), పర్వత్‌రావు (వట్టివాగు), కుడ్మేత బోజ్జిరావు (తిర్యాణి)లను సంఘం డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.

ఘనంగా ఆషాఢ బోనాలు

ఆసిఫాబాద్: జిల్లాలో భక్తులు ఘనంగా ఆషాఢ బోనాల పండుగ జరుపుకున్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లోని పోచమ్మ ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు డప్పులు, వాయిద్యాలతో నెత్తిపై బోనం ఎత్తుకొని మహిళలు సామూహికంగా ఆలయాలకు తరలివెళ్లారు. పీసీసీ సభ్యురాలు మర్సుకోల సరస్వతి, మహిళా సమాఖ్య సభ్యురాలు మార స్వరూప, సంధ్య, జయ, ప్రసన్న, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దహెగాం: భీమన్న ఆలయం వద్ద బోనాలతో మహిళలు

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడ గ్రామంలో ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు నిర్వహించారు. స్థానిక పోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏటా గ్రామంలో పోచమ్మ బోనాలు నిర్వహిస్తామని భక్తులు తెలిపారు.

దహెగాంలో భీమన్న బోనాలు..

దహెగాం: ఆషాఢమాసం పురస్కరించుకుని మండలంలోని బొప్పురం గ్రామ శివారులో ఉన్న భీమన్న ఆలయం వద్ద ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా భీమన్న దేవున్ని మండల కేంద్రంతో పాటు బొప్పురం, ఐనం గ్రామాల్లో ఊరేగించారు. మహిళలు భారీగా బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనం సమర్పించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవుని వద్ద మొక్కులు చెల్లించారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌రూరల్: ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం పట్టణంలో ఘనంగా బోనాల జాతర నిర్వహించారు. ఈసందర్భంగా లారీ చౌరస్తా నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు. బోనాల కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాలతో మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విద్యావతి సీపీరాజ్‌కుమార్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, ముత్త అశోక్, రమేశ్, శ్రీనివాస్, నరేశ్, కుమార్, అనిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పెట్: మండలంలోని ఆయా గ్రామాల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు డప్పు చప్పుళ్లతో అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

రెబ్బెనలో..



ఆసిఫాబాద్: బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల శ్రీ కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి ఆషాఢ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని నాగసాధువులు సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



కాగజ్‌నగర్‌రూరల్: బోనం ఎత్తిన హరీశ్‌బాబు



రెబ్బెన: పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు



చింతలమానెపల్లి: బారెగూడలో..

చెత్త తొలగించరూ..!

దహెగాం: మండల కేంద్రంలో జనావాసాల్లో చెత్తకుప్ప ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తోంది. వర్షాకాలం కావడంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారినపడే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో చెత్తను తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



జనావాసాల్లో చెత్తకుప్ప